నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 16 అక్టోబర్ 2024 | SURYAPET

సూర్యాపేటలో నిరసన తెలుపుతున్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, అధ్యాపకులు

# కొనసాగుతున్న కాలేజీల బంద్

- రెండో రోజూ తెరుచుకోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు
- ఉమ్మడి జిల్లాలో 76 కళాశాలల నిరసన
- నేడు నల్లగొండలో భారీ ర్యాలీ
- బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ కాలేజీలూ బంద్‌లోకి!

రామగిరి, అక్టోబర్ 15 : ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, పీజీ కాలేజీలు మంగళవారం కూడా తెరుచుకోలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డియాండ్ చేస్తూ ఎంజీయూ పరిధిలో 76 కళాశాలలు రెండో రోజూ బంద్ పాటించాయి. తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. భువనగిరిలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, వినాయక చౌరస్తాలో నిరసన తెలిపారు. రామన్నపేటలో శ్రీ హిందూ డిగ్రీ కళాశాల గేటుకు అధ్యాపకులు తాళం వేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బకాయిలు చెల్లిస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు తమ బాధలు పట్టించుకోవడం లేదని కాలేజీల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఎంజీయూ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ కళాశాలలు కూడా బంద్‌లో భాగస్వామ్యం కానున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం బీఈడీ కళాశాలల్లో ప్రాక్టికల్స్ జరుగుతుండగా, అవి పూర్తికాగానే బంద్‌కు వెళ్లనున్నట్లు యాజమన్యాలు వెల్లడిస్తున్నాయి.

**నేడు నల్లగొండ జిల్లా కేంద్రంలో ర్యాలీ**

నల్లగొండ జిల్లా కేంద్రంలోని అన్ని కళాశాలల యాజమన్యాలు, అధ్యాపకులు బంద్‌లో భాగంగా బుధవారం ఉదయం భారీ ర్యాలీ తీయనున్నట్లు వెల్లడించాయి. హైదరాబాద్ రోడ్డులోని కాకతీయ కళాశాల నుంచి ఎన్ కళాశాల, రామగిరి మీదుగా గడియారం సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపాయి.

# సీజ్ చేసిన మిల్లుల్లో మిషనరీ మాయం?

రూ.40 కోట్ల ధాన్యం దిగమింగిన అక్రమార్కుడి లీలలు

- మరో కొత్త మిల్లులో అమర్చేందుకు తరలించినట్లు ప్రచారం
- సూత్రధారులు, పాత్రధారులు అధికారులే!

సూర్యాపేట, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కోసం తీసుకున్న ధాన్యాన్ని తెగనమ్ముకున్న విషయంలో సీజ్ చేసిన ఓ మిల్లులో మిషనరీ మాయమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాదాపు రూ.40 కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యాన్ని మాయం చేసిన సదరు మిల్లు యజమాని ఇతరుల పేరిట మరో మిల్లు నిర్మిస్తూ సీజ్ చేసిన మిల్లులోని మిషనరీని అక్రమంగా అక్కడకు తరలించినట్లు తెలుస్తున్నది. సీఎంఆర్‌ను కొందరు అక్రమార్కులకు వరంలా మార్చుకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం మిల్లులకు అప్పగిస్తే వాటిని మిల్లింగ్ చేయడం మానేసి వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని అడ్డదారుల్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. దాదాపు 400 కోట్ల రూపాయలు ఖాజేసిన సూర్యాపేట జిల్లాలోని ఐదు మిల్లులను అధికారులు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. మొదట మూడు మిల్లులను సీజ్ చేసి యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపగా, వారు బెయిల్‌పై బయటకు వచ్చి దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. సీఎంఆర్ కోసం ఒత్తిడి పెరుగడంతో మరో రెండు మిల్లుల యజమానులు కూడా పైరవీ చేసి మరీ అధికారులతో కేసులు నమోదు చేయించుకున్నారనే ప్రచారం ఉంది.

**ధాన్యమే కాదు మిషనరీనీ వదల్లేదు**

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఐదు మిల్లులు సీజ్ కాగా, లెక్క ప్రకారం ధాన్యం లేని మిల్లులు మరో ఏడెనిమిది వరకు ఉంటాయన్నది అధికారుల అంచనా. వారంతా ఎప్పుడు బిచానా ఎత్తేస్తారో తెలియని పరిస్థితి. ఇదిలా ఉంటే వందల కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్నే గాక ఏకంగా మిల్లులో ఉన్న మిషనరీని కూడా మాయం చేస్తున్న ఘనులు ఉన్నట్లు తెలుస్తున్నది. జిల్లాలోని ఓ మిల్లులో సుమారు 40 కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకున్న యజమాని అందులో ఉన్న సుమారు రెండు కోట్ల రూపాయల విలువ చేసే మిషనరీని కూడా ఎత్తుకుపోయినట్లు సమాచారం. ప్రస్తుతం సీజ్ చేసి ఉన్న మిల్లుకు సుమారు పది కిలోమీటర్ల దూరంలోనే మరొకరి పేరిట కొత్త మిల్లు నిర్మిస్తూ మిషనరీని అక్కడకు తరలించారని తెలిసింది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం అక్రమాల్లో అధికారుల పాత్ర ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నది. ధాన్యం మాయమైందని మిల్లును సీజ్ చేసిన సమయంలో పంచనామా ఎలా చేశారు? అందులో మిషనరీతోపాటు ఇతర సామాగ్రి ఎంత? ధాన్యం ఎంత ఉంది? అనేవి రాశారా, లేదా? అసలు మిల్లుకు తాళం వేసి వచ్చారా, లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

రామన్నపేట: సదస్సులో మాట్లాడుతున్న ఎన్ఈటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రామచంద్రయ్య

# కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమను అడ్డుకుందాం

- 23న ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకించాలి
- పర్యావరణ పరిరక్షణ వేదిక పిలుపు

రామన్నపేట, అక్టోబర్ 15 : రామన్నపేట మండల ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ నెల 23న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని ముక్తకంఠంతో వ్యతిరేకించాలని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఏ రామచంద్రయ్య పిలుపు నిచ్చారు. రామన్నపేటలో అదానీ గ్రూప్ నిర్మించనున్న సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని రహదారి బంగ్లా ఆవరణలో అఖిల పక్ష నాయకులు పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ పార్టీలకు అతీతంగా పోరాడాలన్నారు. సిమెంట్ పరిశ్రమ వల్ల వాయు , శబ్ద, జల కాలుష్యంతో ప్రజా జీవన వ్యవస్థను ఆగమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిమెంట్‌లో కలిపే రసాయనాల మూలంగా సిల్‌కోసిస్ జబ్బుతోపాటు చర్మ వ్యాధులు, గర్భస్రావాలు, అంగ వైకల్యం, పిల్లల ఎదుగుదల లేకపోవడం, కంటిచూపు మందగించడం, శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిశ్రమ ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందని ప్రచారం అశాస్త్రీయమని, తిరోగమనం ఉంటుందని పేర్కొన్నారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ప్రతిఘటింకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని పట్టణ ప్రాంత అభివృద్ధి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ నర్సింహారావు అన్నారు. ఈ నెల 16నుంచి 20 వరకు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ దశల వారీగా పోరాట కార్యాచరణను రూపొందిస్తున్నట్లు అఖిల పక్ష నాయకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో వివిధ పార్టీల నాయకులు ఎండీ జహంగీర్, మేక అశోక్‌రెడ్డి, సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పోశబోయిన మల్లేశం, ఊట్కూరి నర్సింహ, పల్లపు దుర్గయ్య, ఫజల్ బేగ్, నల్ల నరేందర్, గూని రాజు, నంద్యాల భిక్షంరెడ్డి, గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, బొక్క మాధవరెడ్డి, కడారి స్వామియాదవ్, బొడ్డుపల్లి వెంకటేశం, ఎండీ రేహాన్, గోదాసు పృథ్వీరాజ్, గుత్తా నర్సిరెడ్డి, సాల్వేరు అశోక్, రేఖ యాదయ్య, అప్పం లక్ష్మీ నర్సు, వనం చంద్రశేఖర్, కందుల హన్మంతు, ఎండీ జమీరుద్దీన్ ఎస్‌కే చాంద్, నాగటి ఉపేందర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

# గరుకులాలకు తాళం

## నెలల తరబడి అద్దె చెల్లించని ప్రభుత్వం

తుంగతుర్తిలో మైనారిటీ గురుకుల పాఠశాల గేటుకు తాళం వేయడంతో బయట పడిగాపులు కాస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

- పలు దఫాలుగా సర్కారు దృష్టికి యజమానులు
- అయినా కనీసం పట్టించుకోని వైనం
- ఒక్కో భవనానికి రూ.10లక్షల నుంచి రూ.15లక్షలకు పైనే పెండింగ్
- బీసీ, గిరిజన, మైనార్టీ గురుకులాల్లోనూ పేరుకుపోయిన బకాయిలు
- ఉమ్మడి జిల్లాలో 5 గురుకులాలకు తాళం
- పాఠశాలల బయటే ఉండిపోయిన టీచర్లు

దేశంలోనే ప్రత్యేక గుర్తింపును సాధించిన తెలంగాణ గురుకులాలు నేడు అధ్వాన స్థితికి చేరుకుంటున్నాయి. గతంలో గొప్పగా చెప్పుకొన్న గురుకుల వ్యవస్థను కాంగ్రెస్ సరారు అస్తవ్యస్తం చేసింది. అద్దె భవనాలను కిరాయి కూడా చెల్లించకుండా గాలికొదిలేసింది. నెలల తరబడి బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో భవన యజమానులు మంగళవారం గురుకులాలకు తాళం వేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మోత్కూరు మోత్కూరు ఎస్సీ గురుకుల పాఠశాల, హుజూర్‌నగర్, తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేటలో మైనారిటీ గురుకులాలు తెరుచుకోలేదు. దాంతో విధులకు హాజరైన టీచర్లు గేటు బయటే ఉండిపోవాల్సి వచ్చింది.

– సూర్యాపేట/యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ)


హుజూర్‌నగర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలకు తాళం వేస్తున్న భవన యాజమానులు

తెలంగాణ గురుకులాలు అంటేనే ఓ బ్రాండ్. దేశంలోనే ఒక ట్రెండ్‌ను క్రియేట్ చేశాయి. నాణ్యమైన చదువు, మంచి సదుపాయాలు, నైపుణ్యం గల స్టాఫ్, క్రీడలు.. తదితర అంశాల్లో ఒక అడుగు ముందు ఉండేవి. గురుకులాల్లో సీటు కావాలంటే అంతా ఆశామాషీగా ఉండేది కాదు. తల్లిదండ్రులు ఏకంగా మంత్రులు, ఎమ్మెల్యేల లెటర్ల కోసం ప్రదక్షిణలు చేసేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాలు సమస్యలమయంగా మారుతున్నాయి. ఫుడ్ పాయిజన్, వివిధ అనారోగ్య సమస్యలతో విద్యార్థుల అవస్థలు పడుతున్నారు. కొన్ని గురుకులాల్లో పిల్లలు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి.

**గురుకులాల్లో బకాయిలు ఇలా..**

యాదాద్రి భువనగిరి జిల్లాలో బీసీ గురుకులాలకు కూడా ఆరు నెలలుగా బకాయిలు విడుదల చేయడం లేదు. భువనగిరి మండలంలోని అనంతారం, చౌటుప్పల్ మండలంలోని తుప్రాన్‌పేట, ఆలేరు, బీబీనగర్‌తోపాటు బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడిలో సికింద్రాబాద్, యాకత్‌పుర నియోజకవర్గాలకు చెందిన బీసీ గురుకులాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. గిరిజన గురుకుల పాఠశాలకు కూడా ఆరు నెలలుగా అద్దె చెల్లించడం లేదు. నారాయణపురంలోని గురుకులం అద్దె భవనంలో నడుస్తున్నది. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్ ఇంజినీరింగ్‌లో కాలేజీ మైనార్టీ గురుకులం, ఆలేరులో మరో గురుకులం అద్దె భవనంలోనే కొనసాగుతుండగా, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

**లక్షల్లో పెండింగ్..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసింది. సొంత భవనాలు లేనిచోట తాత్కాలికంగా అద్దె భవనాల్లో కొనసాగినా, ఎప్పటికప్పుడు కిరాయి చెల్లించేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతుండగా, 9 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 3 గిరిజన, 3 మైనార్టీ, 8 ఎస్సీ, 5 బీసీ గురుకులాలు ఉన్నాయి. వాటిల్లో 70శాతం వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏరియాను బట్టి ఒక్కో భవనానికి నెలకు రూ. లక్ష నుంచి రూ. 4 లక్షల వరకు అద్దె ఉంది. 5 ఎస్సీ గురుకులాలకు 9 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినా స్పందన లేదు. దాంతో చేసేది లేక మోత్కూరు ఎస్సీ బాలుర గురుకులానికి బిల్డింగ్ యజమాని తాళం వేశారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ ఆవేదనను పరిగణలోకి తీసుకోవాలని వాపోయాడు. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్‌లో మైనారిటీ గురుకులాలు ఉండగా, అన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి నెలకు రూ.60 వేల నుంచి 75 వరకు నెలవారీ అద్దె ఉండగా, దాదాపు 40 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. దాంతో ఈ నాలుగు పాఠశాలలకు యజమానులు తాళం వేశారు.

# డీఎస్సీ కౌన్సెలింగ్ గందరగోళం

## మంగళ వారం హాజరు కావాలని అభ్యర్థులకు ఫోన్లు

- తీరా వచ్చాక వాయిదా పడిందన్న అధికారులు
- వెనుదిరిగిన తర్వాత కౌన్సెలింగ్‌కు రావాలని మళ్లీ ఫోన్
- మధ్యాహ్నం తర్వాత మొదలై అర్ధరాత్రి వరకు సాగిన కౌన్సెలింగ్
- అరకొర వసతులతో అవస్థ పడ్డ అభ్యర్థులు

నల్లగొండ డైట్‌కు కౌన్సెలింగ్ కోసం వచ్చిన డీఎస్సీ అభ్యర్థులు

రామగిరి, అక్టోబర్ 15 : డీఎస్సీ-2024లో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు విద్యా శాఖ గందరగోళంతో తీవ్ర అవస్థలు పడ్డారు. నల్లగొండలోని డైట్ సమావేశ మందిరంలో మంగళవారం పాత పద్ధతిలో ప్రత్యక్ష కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇస్తామని జిల్లా విద్యాశాఖ నుంచి సోమవారం అభ్యర్థులకు ఫోన్లు వెళ్లాయి. దాంతో మంగళవారం ఉదయం 10 గంటల వరకే అభ్యర్థులు డైట్‌కు చేరుకోగా, విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్ వాయిదా పడిందని తాపీగా బదులిచ్చారు. దాంతో అభ్యర్థులు ఇంటికి వెనుదిరిగారు. కొంత సమయం తర్వాత కౌన్సెలింగ్ ఈ రోజే ఉంటుందని మళ్లీ జిల్లా విదాశాఖ నుంచి అభ్యర్థులకు ఫోన్ చేశారు. దాంతో అభ్యర్థులు హుటాహుటిన మార్గమధ్యం నుంచే వచ్చేశారు. ఈ గందరగోళం నడుమ జిల్లా అదనపు కలెక్టర్ టి.పూర్ణచందర్ డీఈఓ భిక్షపతితో కలిసి మధ్యాహ్నం 2 గంట తర్వాత కౌన్సెలింగ్‌ను ప్రారంభించగా, అర్ధరాత్రి వరకూ సాగింది. అనంతరం అభ్యర్థులకు పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులను అందజేశారు.

**చంటి పిల్లలతో అర్ధరాత్రి దాకా..**

ప్రభుత్వం, విద్యాశాఖ నిర్వాకంతో డీఎస్సీ అభ్యర్థులు చాలా ఇబ్బందులు పడ్డారు. చంటి పిల్లలలో వచ్చిన వారు అర్ధరాత్రి వరకు అక్కడే ఉండాల్సి వచ్చిం ది. అరకొర వసతుల మధ్య తమ నెంబర్ ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తూ కూర్చున్నారు. కనీసం తాగు నీటి కూడా కల్పించ లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 8:30గంటల వరకు కేవలం ఎస్జీటీ ప్రభుత్వ విభాగం, స్కూల్ అసిస్టెంట్ అన్ని కేడర్‌లో కౌన్సిలింగ్ పూర్తి చేశారు. వారికి ఉత్తర్వులు ఇవ్వడానికి రాత్రి అయింది. లోకల్ బాడీ విభాగం ఎస్జీటీ కౌన్సెలింగ్ అర్ధరాత్రి వరకు సాగింది. ఆయా కేటగిరీల్లో 535మందికి పోస్టింగ్ ఉత్తర్వులు అందించారు. ఉత్తర్వులు పొందిన వారంతా బుధవారం పాఠశాలలో రిపోర్ట్ చేయాలని చెప్పడంతో అంతా ఆందోళనలో ఉన్నారు.

**పాత పద్ధతిలో కౌన్సెలింగ్**

ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు విద్యాశాఖ ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురుకాలేదు. తాజాగా డీఎస్సీ అభ్యర్థులకు మాత్రం పాత పద్ధతిలో ప్రత్యేక్ష కౌన్సిలింగ్ నిర్వహించడంలో అంతర్యమేంటని ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ చేసి ఉంటే ఇలాంటి ఇబ్బందులు ఉండేవి కావని అభ్యర్థులు వాపోయారు.

# రేపటి నుంచి లతీఫ్ ఉల్లా షా ఉర్సు

- భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలి : కలెక్టర్, ఎస్పీ సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ, అక్టోబర్ 15 : జిల్లా కేంద్రంలో లతీఫ్ ఉల్లా షా ఖాద్రీ ఉర్సు ఉత్సవాలు బుధవారం ప్రారంభమై ఈ నెల 19 వరకు కొనసాగనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. భక్తులు పెద్దఎత్తున హాజరు కానున్నందున ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా జాగ్రత్తలు అధికారులను ఆదేశించారు. ఉర్సు ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16న ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 17న గంధం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. శాంతి యుత వాతావరణంలో ఉర్సు సాగేలా పోలీస్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆర్డీవో, డీఎస్పీలు ఉత్సవాలను పర్యవేక్షించాలని, తాగునీరు, శానిటేషన్‌ను మున్సిపల్ కమిషనర్, మిషన్ భగీరథ ఎస్ఈలు చూసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పార్కింగ్, క్యూ లైన్లు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్లు పూర్ణ చంద్ర, శ్రీనివాస్, ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి, డీఎస్పీ శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో రాజీనామాలు

## పోచంపల్లి హస్తం పార్టీలో రచ్చకెక్కిన విభేదాలు

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తడక వెంకటేశం రాజీనామా
- మద్దతుగా పట్టణాధ్యక్షుడు, వార్డు అధ్యక్ష పదవులకు నేతల గుడ్ బై
- పలువురు ముఖ్య నాయకులతో సమావేశం
- రెడ్డి నాయకులకే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అసహనం
- బీసీలను పట్టించుకోవడం లేదని ఆవేదన

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : భూదాన్ పోచంపల్లి కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. నేతల మధ్య సమన్వయం, సఖ్యత లేకపోవడంతో రాజీనామాల వరకూ వెళ్లింది. తాజాగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తడక వెంకటేశం రాజీనామా చేయడం హట్ టాపిక్‌గా మారింది. ఆయనకు మద్దతుగా మరికొందరు తమ పదవులకు గుడ్ బై చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి నాయకులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడినా పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో పలువురు కాంగ్రెస్ నేత లు, శ్రేణులు మంగళవారం సమావేశం అవడంతో కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.

బ్లాక్ కాంగ్రెస్ పదవికి తడక వెంకటేశ్వర్లు సోమవారం రాజీనామా చేశారు. 30 ఏండ్లుగా ఆయన పార్టీని అంటి పెట్టుకుని పని చేస్తున్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా అంకిత భావంతో పని చేసి, కార్యకర్తలకు అండగా నిలిచారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఆయన భార్య తడక లతను రెండు సార్లు సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. గతంలో పోచంపల్లికి ఉప సర్పంచ్‌గా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా పని చేశారు. కొంత కాలంగా ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గినట్లు తెలుస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దూరం పెడుతున్నారనే ప్రచారం జరిగింది. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమయం కేటాయించే వారని, ఇప్పుడు కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పార్టీ కార్యక్రమాలు ఎక్కడ జరిగిన పార్టీ బాధ్యులకు సమాచారం లేకపోవడం, అందరినీ భాగస్వాములను చేయకపోవడం, స్థానిక ఎమ్మెల్యే చూసీచూడనట్టు వ్యవహరించడంతో ముఖ్య నాయకులు ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తున్నది. ఎమ్మెల్యే ఏదో సాకులు చెప్పి అంటీముట్టనట్లుగా ఉంటున్నారని, అందుకే వెంకటేశర్లు రాజీనామా చేశారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

**రెడ్డి నాయకులకే పెద్ద పీట!**

కుంభం ఎమ్మెల్యే అయ్యాక రెడ్డి వర్గానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆ పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎక్కడ కార్యక్రమాలు జరిగినా కొందరు మాత్రమే ఆయన చుట్టూ ఉంటున్నారని, వాళ్లు చెప్పిన మాటలే ఎమ్మెల్యే వింటున్నారని చర్చ నడుస్తున్నది. బీసీలను పెద్దగా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. దాంతో మంగళవారం భూదాన్‌పోచంపల్లిలో కాంగ్రెస్ పట్టణ నేతలు సమావేశమై ఎమ్మెల్యే తీరును ఖండించారు. తడక వెంకటేశానికి మద్దతుగా రాజీనామా పత్రాలను అందించారు.

**రాజీనామా చేసింది వీరే..**

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. ఒకటో వార్డు అధ్యక్షుడు దారెడ్డి భాస్కర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండ్ల నవనీత, నాలుగో వార్డు అధ్యక్షుడు కుక్క కుమార్, ఐదో వార్డు నుంచి మెరుగు యతీనందం, ఎనిమిదో వార్డు నుంచి సామల సుధాకర్ రెడ్డి, తొమ్మిదో వార్డు నుంచి కూరపాటి బాబు, పదో వార్డు నుంచి చేరాల మహేందర్, 11వ వార్డు నుంచి కర్నాటి బాలరాజు, 12వ వార్డు నుంచి వేముల ఆనంద్, 13వ వార్డులో గుండు ఉప్పలయ్య, ఎన్ఎస్‌యూఐ పట్టణాధ్యక్షుడు కుక్క అరుణ్ తమ పదవులకు రాజీనామా చేశారు.

**నేడు, రేపు కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలు**

సూర్యాపేట అర్బన్, అక్టోబర్ 15 : ఈ నెల 16,17 తేదీల్లో జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో నిర్వహించే కళా ఉత్సవ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 9, 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. కళా ఉత్సవ్‌లో భాగంగా విద్యార్థులకు ఓకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్, డ్యాన్స్, థియేటర్, విజువల్ ఆర్ట్స్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ వంటి అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ జనార్దన్ 9441273052, దేవరాజ్ 9989457087 నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

**ఆలేరు ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు**

ఆలేరు టౌన్, అక్టోబర్ 15 : ఆలేరులోని ప్రభుత్వ ఐటీఐలో 6వ విడుత వాక్ ఇన్ అడ్మిషన్ల కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో సీట్లను కేటాయించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ బి.హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 19లోపు ITI.TELANGANA.GOVT.INలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.